శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## బిట్రగుంటలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తనిఖీలు






**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో గురువారం సాలుసరి తనిఖీలలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్ పర్యటించారు. విజయవాడ నుండి గూడూరు వరకు జరిపిన ఈ తనిఖీలలో బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో సుమారు గంటకు పైగా ఆయన పర్యటన కొనసాగింది. రైల్వే రన్నింగ్ రూమ్, క్రూకంటోల్ కార్యాలయం, రైల్వే స్టేషన్ వంటివి పరిశీలించారు. పలు కార్యాలయాలలో సిబ్బంది పనితీరుపై ఆరా తీయడంతో పాటు 3వ రైల్వే లైన్ పూర్తయిన సందర్భంగా నూతనంగా నిర్మించిన రైల్వే భవనాలను ఆయన పరిశీలించారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన ఆయనకు పలువురు అధికారులు ఘనస్వాగతం పలికారు. గత రెండు నెలలుగా జియం పర్యటనలో పలు శాఖల అధికారులు నిమగ్నమై రేయింబవళ్లు కార్యాలయాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆయా కార్యాలయాలలో సిబ్బంది అప్రమత్తంగా వుండి జియం పర్యటన పూర్తి కావడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. జియం వెంట దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు, డివిజనల్ రైల్వే మేనేజర్ సువేంద్రమోహన్, ఎడిఆర్‌యం శ్రీనివాసరావు తదితరులు వున్నారు.

## 28న చంద్రబాబు పర్యటన



**కందుకూరు, డిశంబర్22, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా పర్యటనకి వస్తున్నారు. ఇదేంకర్మ అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజుల పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా టిడిపి నేతలు తగిన కార్యచరణ రూపొందించారు. ఈ నెల 28బుధవారం కందుకూరికి వస్తారు. అక్కడ వివిధ కార్యక్రమాలకు హాజరై రోడ్డుషో నిర్వహిస్తారు. ఇందుకోసం ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తను ఇన్‌చార్జి అయిన తర్వాత మొట్టమొదటిసారి అధినేత వస్తుండడంతో భారీగా స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆయన వివిధ గ్రామాలకు వెళ్లి కార్యకర్తలను, ప్రజలను ఈ కార్యక్రమానికి హాజరైయ్యే విధంగా ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు. నియోజకవర్గంలోని కందుకూరు పట్టణంలో భారీ ర్యాలీ జరిగిన అనంతరం లింగసముద్రం మండలం చిన్నపవనిమీదుగా కొండాపురం మండలం సాయిపేటలో అధినేత చంద్రబాబునాయుడు ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం రాత్రికి కావలిలో బస చేస్తారు. 29న కావలిలో జరిగే ఇదేంఖర్మ కార్యక్రమంలో పాల్గొంటారు. మరుసటి రోజు అనగా కోవూరు నియోజకవర్గంలో కార్యక్రమంలో పాల్గొని తన పర్యటన ముగిస్తారు. ఈ మేరకు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన టిడిపి నేతల పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం.. రోగికి వేలు తొలగించాల్సిన పరిస్థితి



**నెల్లూరు డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి)లో అనుభవజ్ఞులైన సీనియర్ డాక్టర్లున్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ లాంటి ఆధునిక పరికరాలు కూడా ఉన్నాయి. అక్కడ డాక్టర్లు అందించే చికిత్స కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఉంటుంది. వైద్యం కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. అయితే అక్కడ డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం కూడా అంతకుమించి ఉంటుందని అని అనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అందుకు నిదర్శం రోగి వెంకమ్మే. పెద్దాసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన వెంకమ్మకు వైద్యుల నిర్లక్ష్యంతో ఆమె ఎడమచేతికి చెందిన నడిమి వేలు తొలగించాల్సిన దుస్థితితోపాటు ముంజేతి పైభాగాన ఉన్న కండను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు విడవలూరు మండలం చౌకచర్ల దళితవాడకు చెందిన 60 ఏళ్ళ పైబడిన కాగొల్లు.వెంకమ్మకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. ఆమె కుమార్తె సుమతి కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. వెంకమ్మకు స్ట్రోక్ రావడంతో తన తల్లిని పెద్దాసుపత్రిలో మంచి వైద్యం అందుతుందనే నమ్మకంతో వారం రోజుల క్రితం స్ట్రోక్ గురైన తన తల్లిని పెద్దాసుపత్రిలో చేర్పించింది. డాక్టర్లు ఆమెకు అందించిన వైద్యంతో కోలుకుంది. గురువారం ఆమె డిశ్చార్జి కావాల్సింది. ఈ తరుణంలో ఒక జూనియర్ డాక్టర్, నర్సుల నిర్లక్ష్యం ఫలితంగా ఆమెకు ఆవేదనను మిగిల్చారు. 4రోజుల క్రితమే ఆమెకు ఫ్లూయిడ్స్ (సెలైన్) ఎక్కించిన చేయివాచిపోయి ఉబ్బింది. చేయి నొప్పి పెడుతుందని ఆమె చేతికున్న క్యానును (మందు ఎక్కించే పొడవైన సూది) తీసేయాలని కోరింది. అయితే అక్కడ శిక్షణలో ఉన్న జూనియర్ డాక్టర్ ఏమి కాదని సర్దిచెప్పాడు. అంతేకాకుండా యాంటిబయాటిక్ ఇంజెక్షన్ మందును అదే సూది నుండి చేతిలోనికి పంపాడు. ఆమె నొప్పితో బాధపడుతున్నా ఏమి కాదన్నారు. తీరా ఆమందు రక్తనరాల్లోకి పోకుండా చర్మం కింద చేరి మరింత వాచిపోయింది. శిక్షణ పొందిన నర్సింగు సిబ్బంది డ్యూటీలు మారుతున్నారేగాని ఏదో ఒక షిఫ్టులో ఉన్న నర్సు ఆమె పరిస్థితి చూసి సూది తీసేసి ఉంటే సరిపోయేది. వీళ్ళ సంగతి పక్కనపెడితే రౌండ్స్ వేసే సీనియర్ డాక్టర్లు సైతం ఆమె గురించి పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. దీంతో చర్మం కింద చేరిన నీరు, దాంతోపాటు ఇంజక్షన్ మందు బయటకు వెళ్ళకపోవడంతో రక్త ప్రసరణ ఆగిపోయింది. ఫలితంగా చేతి మధ్య వేలు నల్లగా ఎండిపోయింది. అంతే కాకుండా ముంజేతిపై కండ భాగం నల్లగా మారి దెబ్బతింది. అప్పుడు మేలుకున్న వైద్యులు అవసరమైతే ముంజేతి వరకు చేతిని తొలగించాలని చెప్పారు. దీంతో రోగితోపాటు సుమతి దిగ్భ్రాంతి చెంది భోరున విలింపించింది. మళ్ళీ వెంకమ్మకు స్కానింగ్ చేసిన తరువాత ముంజేతిపైన ఉండే కండను తొలగించాల్సి వస్తుందన్నారు. దీంతో రోగి అల్లాడిపోతోంది. పూట గడవడం కోసం కూలీపనులు చేసుకునే సుమతి తన తల్లికి వైద్యం కోసం పెద్దాసుపత్రికి వస్తే డాక్టర్లు చేసిన చికిత్సతో తల్లి కోలుకుంది. ఒక వైపు మంచి చికిత్స మరోవైపు విపరీతమైన నిర్లక్ష్యంతో తన తల్లికి చెడు జరిగిందని, ఏమి చేయాలో తనకు అర్థం కావడం లేదని సుమతి కన్నీళ్ళ పర్యంతం అయింది. సూదిని ఎన్నిసార్లు తియ్యమని చెప్పినా తీయ్యకపోవడంతో ఇంత దూరం వచ్చిందని సుమతి ఆవేదన వ్యక్తం చేసింది.

**విచారణ జరుపుతున్నాం: డాక్టర్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్**

ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందిస్తున్నాం. అయితే ఇలా ఎలా జరిగిందో విచారణ చేస్తున్నాం. రోగికి మంచివైద్యం అందించి అండగా ఉంటాం.

## ప్రజలు తగు జాగ్రత్తలతో బయటకు రావాలి

**నెల్లూరు డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** కరోన బి.ఎఫ్-7 వేరియంట్ కేసులు దేశంలో మూడు నమోదు అయ్యాయని దానిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఇంటి నుండి బయటకి వచ్చేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ వేసుకుని, శానిటైజన్‌ను దగ్గర ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య గురువారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కరోనా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 29 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు 50 చొప్పున రాపిడ్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు ముగ్గురికి కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపాలన్నారు. కరోనా అనే అనుమానం వ్యక్తులు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వివరించారు.

# దేశానికి ఆదర్శవంతంగా విద్యా వ్యవస్థ

**వెంకటాచలం, డిసెంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర చరిత్రలో విద్యా వ్యవస్థలో సమూలమార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కనుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుణాత్మకమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ట్యాబ్‌ల పంపిణీకి సీఎం శ్రీకారం చుట్టారన్నారు సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.10 కోట్ల విలువైన 3130 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. నాడు నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చి, ముఖ్యమంత్రి అమ్మ ఒడి



పథకంలో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రుల మనోభావాలు దెబ్బ తినే విధంగా కాకుండా విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు కీర్తి ప్రతిష్టలు పెంచేలా పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చే విధంగా విద్యను అభ్యసించాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు. విద్యార్థులు విద్య ద్వారా దేనినైనా సాధించవచ్చున్నారు. బైజుస్ కంటెంట్‌తో రూపొందించిన ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు చక్కగా వినియోగించుకుని సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుని మంచి విద్యార్థులుగా తయారు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో సుస్మిత, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి వెంకటశేషయ్య, సర్పంచు నాటకం శ్రీనివాసులు, ఎంపీటీసీ పచ్చబొట్ల మస్తానయ్య, హెచ్‌ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక

**నెల్లూరు అర్బన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** విద్యుత్ పొదుపు ప్రత్యామ్నాయ వనరుల సమీకరణ అంశంలో భాగంగా రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని సాధించిన కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అభినందించారు. విద్యుత్ పొదుపు ప్రత్యామ్నాయ వనరుల సమీకరణలో భాగంగా పడుగుపాడు పంచాయతీ సచివాలయంలో సోలార్ వ్యవస్థతో పాటు బ్యాటరీ ఆటోను, సోలార్ లైట్‌లను ఏర్పాటు చేయడం వలన రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపిక కాబడి ఈ నెల 20వ తేదీన విద్యుత్ శాఖ వారు విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీపీవో చిరంజీవి, పడుగుపాడు గ్రామ ఉప సర్పంచు, పంచాయతీ కార్యదర్శి, ఎనర్జీ అసిస్టెంట్‌లతో కలిసి అవార్డును అందుకోవడం జరిగింది. విజయవాడలో అవార్డు స్వీకరించిన ఇన్‌చార్జ్ డీపీవో చిరంజీవి, పడుగుపాడు గ్రామ ఉపసర్పంచు ఎస్.కె.అహ మ్మద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిలతో కలిసి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరినీ అభినందించారు.



# ప్రకటనల పన్నులు సకాలంలో చెల్లించండి

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ పరిధిలోని వాణిజ్య ప్రకటనల ప్రదర్శనకు చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని యాడ్ ఏజెన్సీ నిర్వాహకులను కమిషనర్ హరిత సూచించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది, యాడ్ ఏజెన్సీ నిర్వాహకులతో కమిషనర్ సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాడ్ ఏజెన్సీలకు డిస్‌ప్లే డివైస్ పీస్ గురించి వివరించి, ప్రకటనల నిర్వాహకులకు ఉన్న సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. యాడ్ ఏజెన్సీ నిర్వాహకులకు ఉన్న అభ్యంతరాలకు



రాతపూర్వకంగా సమర్పించాలని, పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు. యాడ్ ఏజెన్సీల పన్నుల బకాయిలను ప్రణాళికాబద్ధంగా వసూలు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. వాణిజ్య ప్రకటనల ప్రదర్శనలకు నగరపాలక సంస్థ సూచించిన మార్గదర్శకాలను యాడ్ ఏజెన్సీలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భారీ హోర్డింగ్‌ల ఏర్పాటులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రకటనలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. వివిధ యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిట్రగుంటను రైల్వే పరంగా అభివృద్ధి చేసేందుకు సహకరించండి

**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంటలో రైల్వే పరంగా వందలాది ఎకరాలు నిరుపయోగంగా వున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని రైల్వే పరంగా ఏదైనా యూనిట్‌ని ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్‌కు కావలి శాసనసభ్యులు రామిరెడ్డి



ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ బిట్రగుంట పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయన కలిసి నియోజవర్గంలో రైల్వే సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలి నియోజకవర్గం పారిశ్రామికంగా, ఓడరేవులతో అభివృద్ధి చెందుతోందని విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు కూడా ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతుందని ఇదే తరహాలో మీరు కూడా రైల్వే పరంగా ఏదైనా యూనిట్ ఏర్పాటు చేసి నిరుపయోగంగా వున్న రైల్వే ఆస్తులను సద్వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై తాను రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా కేంద్రానికి విన్నవించడం జరిగిందని తమ పార్టీ పార్లమెంటు, రాజ్యసభ సభ్యులు సీనియర్ అధికార్ల సమావేశంలో కూడా మీ దృష్టికి తేవడం జరిగిందని గుర్తు చేశారు. కావలి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌలభ్యం కోసం యశ్వంత్‌పూర్, శబరి ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలని, వృద్ధులు, వికలాంగులు రైల్వే స్టేషన్‌కు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. బిట్రగుంటలో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని, 144 రైల్వే క్రాసింగ్ గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మించాలని తెలిపారు. బిట్రగుంటలో కొవిడ్‌కు ముందు నిలిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు అన్ని క్రూఛేజింగ్‌కు ఆగుతున్నాయని వాటికి అధికారికంగా స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ కూడా వేర్వేరుగా ఈ డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకుపోవడంతో వీటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని జియం హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటిసి మద్దిబోయిన కీర్తన, వైసిపి సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## లింగనిర్ధారణ పరీక్షలు వెల్లడించిన వైద్యులకు 3 సంవత్సరాలు జైలు శిక్ష



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త** లింగనిర్ధారణ పరీక్షలు జరిపి ఆడ, మగ అన్న విషయం తెలిపిన వైద్యులకు మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరుగుతుందని కావలి ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. గురువారం కావలి ఆర్డీవో కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో పిసి, పిఎన్‌డిటి చట్టాన్ని అమలు చేయాలని, లింగనిర్ధారణ చేస్తే జరిగే పరిణామాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కావలి ఆర్డీవో శీనానాయక్ మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో నెలకొని వున్న పురుష సంతాన ప్రాధాన్యత, ఆడ పిల్లల పట్ల వివక్షత జరుగుతుందన్నారు. మూఢ నమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలిస్తే గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిందన్నారు. దీనిని నిరోధించేందుకు ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈ చట్టం గర్భం ధరించడానికి ముందు కానీ తర్వాత కానీ లింగ ఎంపికను నిరోధిస్తుందన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఆడ పిల్లల సంరక్షణకు అందరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత, మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, కావలి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, ఎపి ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.శివకుమార్, రూరల్ ఎస్ఐ వెంకట్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సియం చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** జిల్లాలో ఈ నెల 28,29,30 తేదిలలో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమానికి విచ్చేయనున్న దృష్ట్యా ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్లమెంటరీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు విజ్ఞప్తి చేశారు. బోగోలులోని బాలకళ్యాణమండపంలో గురువారం చంద్రబాబు పర్యటనపై పార్టీ సన్నాహక కమిటీ సమావేశం



జరిగింది. గ్రామాల వారీగా పార్టీ నేతలతో కావలి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో పర్యటన విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణా రాష్ట్రంలో కూడా ఖమ్మం జిల్లాలో జరిగిన చంద్రబాబు పర్యటనకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. రాబోయే రోజులలో తెలుగు రాష్ట్రాలలో టిడిపిదే అధికారమని ప్రతి కార్యకర్త, నాయకుడు చిత్తశుద్ధితో పనిచేసి అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. అధికార పార్టీ అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని మధ్యంతర ఎన్నికలకు సమాయత్తమవుతుందని ఈ అవకాశాన్ని టిడిపి శ్రేణులు ఛాలెంజ్‌గా స్వీకరించాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, కోడూరు వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆర్చరీ పోటీలకు జేబీఆర్ విద్యార్థి

**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఏ. సాత్విక్ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవల్ చాంపియన్ షిప్ విజయవాడలో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జనవరిలో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. మేరకు గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిరుపాలు, కోచ్ విజయ్ భరద్వాజ్‌లు ప్రత్యేకంగా



అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏ. సునీల్ కుమారుడే సాత్విక్ అని, ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కూడా ప్రత్యేకంగా వారిని అభినందించారు.

## ఆర్‌బికె కేంద్రాలలో యూరియా స్కాం



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త:** రైతులకు అందించాల్సిన యూరియాలో రైతు భరోసా కేంద్రాలలో స్కాం జరుగుతుందని కోవూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పంచేడు తూర్పు హరిజనవాడ,కాగులు పాడు గ్రామాలలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గోన్న సందర్భంగా ఆయన మాట్లాడుతు వైసిపి ప్రభుత్వం అడుగడుగున ప్రజల్ని మోసం చేస్తుందని విమర్శించారు. గ్రామాలలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజలు భయటకు వచ్చి నిర్భయంగా సమస్యలు చెప్పలేకపోతున్నారని ఆయన ఆగ్రహాం వ్యక్తం చేశారు.వైసిపి ప్రభుత్వ అరాచాకాలకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని అన్నారు. నారు వేసుకోవాలంటే ఒక్క ఎకరాకి రైతుకు 35 వేల రూపాయాలు ఖర్చు అవుతుందని అన్నారు.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నిత్యావసర వస్తువులు పెంచారు.... ఇసుక పెంచారు.... కరెంటు చార్జిలు పెంచారు..... బస్సు చార్జిలు పెంచారు.ప్రజలు ఈ ప్రభుత్వం హయాంలో స్వేచ్ఛగా బ్రతకలేక పోతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈకార్యక్రమంలో పార్లమెంటరీ అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, జిల్లా రైతు విభాగం అద్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అద య్యక్షులు ఎం.వి శేషయ్య, జిల్లా బిసి సంఘం ప్రధాన కార్యదర్శి బత్తల హరికృష్ణ,వింజం రామానాయుడు,బండ్ల కొండయ్య, తాళ్ల నరసింహస్వామి,వల్లూరు శ్రీనివాసులు మినగల్లు నాయకులు సురేష్, పంచేడు నాయకులు, తదితరులు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## విద్యారంగంలో అనేక మార్పులు



కందుకూరు,డిశంబర్22,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక మార్పులు తీసుకుని వచ్చినట్లు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి వెల్లడించారు.గురువారం కందుకూరులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శ్యామ్‌సంగ్ ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంచి వారిని అత్యునత స్ధానానికి తీసుకుని వెళ్లేందుకు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు.రాష్ట్ర చరిత్రలో నవవిదా యశకమని మహీధర్‌రెడి వ్యాఖ్యానించారు.గ్లోబల్ విద్యావిధానాన్ని అందిబుచ్చుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థినీ విద్యార్థులను తయారు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ పథకం అద్భుతమని కొనియాడారు.కందుకూరు నియోజకవర్గంలో 8కోట్లా 40లక్షలు విలువచేసే ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

## మానవత్వం చాటిన టిడిపి ఇన్‌చార్జి

**కందుకూరు,డిశంబర్22,ప్రభాతవార్త:** కందుకూరు టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్నారు.ప్రమాదం జరిగిన దగ్గర ఉండి క్షతగాత్రులను తమ కారులో చికిత్స కోసం వైద్యశాలకు తరలించిన ఘటన గురువారం చోటుచేసుకుంది.ఇన్‌చార్జి నాగేశ్వర రావు బృందం వివిధ కార్యక్ర మాల నిమిత్తం గుడ్లూరు మండ లానికి బయలు దేరి వెళ్లారు. మార్గమ ద్యంలో ఆ మండ



లం లోని గుళ్లపాలెం అడ్డరోడ్డు వద్ద ప్రమాణికులను ఎక్కించుకుని వస్తున్న ఆటో బోల్తా పడింది.ఇదే సమయంలో అటుగా వస్తున్న నాగేశ్వరరావు గమనించి తన కాన్వాని నిలుపుదల చేసి ప్రమాదానికిగురైన వారిని ఆసుపత్రికి తరలించే కార్యక్రమం చేపట్టడం జరిగింది.రాళ్లపాడు గ్రామానికి చెందిన మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ఘటనలో ఆటోలో చిక్కుకున్న వారిని నాగేశ్వరరావుతో పాటు ఆయన వెంటఉన్న నాయకులు వారిని బయటకు తీసుకుని వచ్చారు.ప్రమాదం వివరాలు తెలుసుకుని వారిని తమ కారులోఎక్కించి కందుకూరు వైద్యశాలకు పంపించారు.ఈ ప్రమాదంలో పలువురికి గాయాలై య్యాయి .క్షేమంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఎస్సీ, ఎస్టీలను నిర్వీర్యం చేసిన దుర్మార్గుడు జగన్




**నెల్లూరు డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం:** ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్ర, దేశ అభ్యున్నతి దోహదపడుతుందని అంబేద్కర్ ఆనాడు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, అందుకు 27 పథకాలను గత ప్రభుత్వాలు చేశాయని, నేడు జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వాటిని తుంగలో తొక్కి ఎస్సీ, ఎస్టీల ఎదుగుదలని అడ్డుకుంటున్న దుర్మార్గుడు జగన్ అని భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మండిపడ్డారు. గురువారం నగరంలోని బిజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఫామ్-డి చదివిన విద్యార్థులకు రీఎంబర్స్‌మెంటు ఆపినందు వలన కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లు కాలేజీ యాజమాన్యాలు ఇవ్వకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాసులు ఆరోపించారు. కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా గిరిజన యువతీ యువకులు ఎస్ఎస్‌సీ పాస్ అయి ఉండాలనే నిబంధన వల్ల అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సహాయం అందడము లేదన్నారు. గిరిజనులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని మేము డిమాండు చేస్తున్నామన్నారు. నెల్లూరులోని ఐటిడిఏ ద్వారా యానాదులకు ఎటువంటి సహాయం అందడం లేదన్నారు. నిధులు ఐటిడీఏ కేటాయించడమేనన్నారు. నెల్లూరు జిల్లా ఐటీడిఏకి స్వయం ప్రతిపత్తి కలిగించి, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి యానాదులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజేపీ జిల్లా అధ్యక్షుడు మానికల.సంజీవమ్మ, కార్యదర్శి పోట్లూరు.సురేఖ, కోశాధికారి పూజారి.మురళీమోహన్, పకుల.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## గణితశాస్త్ర పితామహుడు రామనుజన్ 135 వజయంతి

సీతారామపురం డిసెంబర్ 22 ప్రభాతవార్త: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివా సఅయ్యంగారు రామానుజన్ 135 వ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని గురువారం స్దానిక వేదగర్భ ఇంగ్లీషు మీడియం పాఠశాల నందుపాఠశాల అడ్మినిస్టేటర్ బ్రహ్మయ్య ఆద్వర్యంలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలుఘనంగా




నిర్వహించారు.శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పి ంచారు.అనంతరం రామానుజన్ గణిత శాస్త్రానికి చేసిన సేవలను స్మరించుకొని మాట్లాడుతు విద్యార్థులు గణితం పట్ల భయం అవసరం లేదని సాధనతో సులభంగా గణితంలో మంచి ఫలితాలు పొందవచ్చునని అన్నారు.గణితంలో రాణించిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో రాణిస్తారని అన్నారు.

## ఓవెల్ మినర్వా పాఠశాలలో గణిత శాస్త్ర వేడుకలు



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త:** శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని కావలి పట్టణంలోని ఓవెల్ మినర్వా పాఠశాలలో గురువారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడారు. నిజ జీవితంలో గణితం యొక్క వినియోగం చాలా అవసరమన్నారు. గణితం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ గణిత సిద్ధాంతాలు, సూత్రాల మీద చేసిన నృత్య ప్రదర్శనలు,గణిత శాస్త్ర పుస్తక ప్రదర్శన శాల అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కదిరినేనిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం




**మర్రిపాడు,డిసెంబర్22ప్రభాతవార్త:** మండలంలోని కదిరినేనిపల్లిలో డాక్టర్ సయ్యద్, సర్పరాజ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.మర్రిపాడు పిహెచ్‌సి వైద్యాధికారిణి కల్పన ఆదేశాల మేరకు చిన్నమాచనూరు సచివాలయంలో పరిధిలోని కదిరినేనిపల్లిలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరిక్షించి మందులను ఇవ్వడం, గ్రామంలో మంచానికి పరిమితమైన వారిని పరిక్షించడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భారతదేశంలో కొత్తగా వచ్చిన కరోనా(బిఎఫ్-7) వేరియంట్ మీద వినూత్నంగా కరోనాపై యుద్ధానికి మేము సిద్ధం కరోనాను జయించడానికి మనమందరం సిద్ధం అంటూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వీకయ రక్షణగా మాస్క్ , శానిటైజర్, సామాజిక దూరం పాటించాలని ప్రజలకు సూచించారు. వచ్చేది పండగల సీజన్ కావున జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో ఎఎన్ఎం సుప్రియ, 104వాహన సిబ్బంది ప్రసన్న, మస్తాన్, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు



**మర్రిపాడు,డిసెంబర్22ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నందవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం గణితశాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జన్మది వేడుకలను ప్రిన్స్‌పాల్ శారదాకుమారి ఆధ్వర్మంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కరిమద్దెల నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల అవగాహన కల్పించారు. శ్రీనివాసరామానుజన్ జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు పరిక్షలకు గణితశాస్త్రంలో ఆత్మవిశ్వాసంతో ప్రిపేర్ అయ్యేందుకు మోటివేషన్ సెషన్ నిర్వహించామని గణిత ఉపాధ్యాయుడు సరస శ్రీనివాసకుమార్ తెలిపారు. గణితపాటలు పాడుతూ విద్యార్థులు తయారుచేసిన గణిత మోల్స్‌ను ప్రదర్శించారు. ఆటలు, పాటల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

**మర్రిపాడు,డిసెంబర్22ప్రభాతవార్త:** ప్రపంచ గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జన్మదినం సందర్భంగా మండలంలోని చుంచులూరు ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావిగా ఘనత సాధించిన శ్రీనివాస రామానుజన్ మన దేశానికి చెందిన వ్యక్తి కావడం



మనకెంతో గర్వకారణమన్నారు. ఆయన ఎన్నో గణిత సమస్యలకు సులువైన పరిష్కారాలను తెలియజేశారు. ఎన్నో కొత్త కనుగొని ఆ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకొని నేడు మనం గణిత సమస్యలను ఎంతో సులువుగా సాధిస్తున్నామన్నారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు మురళీమోహన్ ను ఈసందర్భంగా విద్యార్థులు ఎంతో ఘనంగా సత్కరించారు. ఆయన ఆధ్వర్యంలో తయారుచేసిన దాదాపు వంద గణిత ప్రాజెక్టులను పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించారు. బాగా తయారుచేసిన వాటిని ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అశోక్ , వెంకటరెడ్డి, రబ్బాని, రేవతి, సురేంద్ర, మాధవరావ్, ఖాజారసూల్, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్లో ఘనంగా శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు




**కలిగిరి,డిసెంబర్22, ప్రభాతవార్త;** శ్రీనివాస రామానుజమ్ జన్మదిన వేడుకలు కలిగిరిలోని ఎపి మోడల్‌స్కూల్లో ఘనంగా నిర్వహించారు.శ్రీనివాస రామానుజమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం మోడల్ స్కూలు అద్యాపకులు, విద్యార్థులుజాతీయ ఘణితశాస్త్రదినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు.ప్రతి సంవత్సరం డిసెంబర్22న జాతీయ ఘణిత శాస్త్రందినోత్సవాన్ని పాఠశాలల్లో ఆనవాయితీగా జరుపుకుంటారు.ఈసందర్భంగా మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గణిశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజమ్ అన్నారు.రామానుజమ్ జీవిత విశేషాలు ప్రతిఒక్కరూ తెలుసుకొని ఆయన బాటలో నడిస్తే బావితరాల భవిష్యత్ బంగారు బాటలు వేయవచ్చన్నారు.ఈ సందర్భంగా స్కూల్లో వివిధరకాల సాంస్కృతికకార్యక్రమాలు,క్విజ్ ,వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు విద్యార్దులు పాల్గొన్నారు.

## శానిటరీ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పురపాలక సంఘంలో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సచివాలయం కార్యదర్శి పెంచలయ్యపై అదే డివిజన్ వార్డ్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ దుర్భాషలాడుతూ భౌతిక దాడి చేయడం అనేది చాలా హేయమైన చర్య అని, ఈ దాడి సచివాలయం వ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణిస్తూ నెల్లూరు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకుల ద్వారా సురేష్‌బాబు, బాల రాజన్, పాండురంగా, రమణ, వెంకటేష్, గౌరీ శంకర్‌లు తీవ్రంగా ఖండిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండాలి అంటే కారణం అయిన శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను సస్పెండ్ చేసి అతనిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుని, సచివాలయం ఉద్యోగులలో ఆత్మస్థైర్యం నింపాలని వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కోరింది.

## మొక్కలులేవు.. మట్టిలేదు.. అవినీతిమయంగా ఉపాదిపనులు

**వరికుంటపాడు,డిశంబర్22,ప్రభాతవార్త:** అవినీతిమయంగా ఉపాదిహామీ పనులు జరుగుతున్నట్లు మండలంలో జరుగుతున్న సామాజిక తనిఖీలలో బయటపడుతుంది గురువారం మండలంలోని టి.కొండారెడ్డిపల్లి గ్రామంలో సామాజిక తనిఖి గ్రామసభను సర్పంచ్ ఏనుగు.వెంకటేశ్వరరెడ్డి అద్యక్షతన



నిర్వహించారు.ఈసభలో గ్రామంలో జరిగిన 2020,21,2021,22 ఆర్ధిక సంవత్సరాలకుగాను జరిగిన పనులగురించి వెళ్ళడించారు.అవెన్యూ ప్లాన్‌టేషన్‌ద్వారా అనేకమార్లు అక్షలరూపాయలు వెచ్చించి మొక్కలు నాటినా వాటిని సంరక్షించలేకపోవడం గుర్తించారు.కొన్నిచోట్ల గుంతలు తీయడం ఆగుంతలు బూడిపోవడంకూడా జరిగిందని ఇలా మొక్కల పెంపకంలోనే లక్షలరూపాయల ప్రజాధనం బూడిదలో పోసినట్లయింది.అందరికి సొంత ఇల్లు అందించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన లేఅవ్‌ట్లలో బారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు,గ్రామ సర్పంచ్ అడిట్ బృందానికి ఫిర్యాదుచేశారు.ఈలేఅవ్‌ట్లకు సంబందించి అప్పటి ఇ.సి,సి.ఎలు పనులు జరగకుండానే 118క్యూబిక్ మీటర్లకు అదనంగా బిల్లు చెల్లించడమేకాక కిలోమీటర్‌నుండి మట్టిని తీసుకువస్తే 5కిలోమీటర్ల నుంచి మట్టిని తీసుకువచ్చినట్లు తప్పుడు ఎం బుక్‌లుచేసి అక్రమాలకు పాల్పడినట్లు గ్రామస్తులు ఫిర్యాదుచేశారు.అందులో వారికి ఎంతముడుపులు అందాయో మరి ప్రభుత్వ నిధులను అప్పనంగా అప్పగించారు.అలాగే స్తానిక ఎం.పి.యు.పి పాఠశాలలో ఆటస్తలం అభివృద్ధికోసం ఒకేపనికి రెండు రకాల బిల్లులు చేసుకొని నిధులు స్వాహాచేశారని అటు గ్రామ పంచాయతినుండి అదేపనికి నిధులు డ్రాచేసుకోగా ఉపాదిహామీనుండి సైతం బిల్లులు చేసినట్టు గ్రామస్తులు ఫిర్యాదుచేశారు.అంతేకాక ఉపాదిహామీనుండి 660ట్రిప్పుల మట్టిని చదునుకోసం ఉపయోగించాల్సివుండగ 100ట్రిప్పులు తోలి నామమాత్రంగా పనిచేసి 660 ట్రిప్పుల మట్టిని తోలినట్లు బిల్లులు చేయించుకొని నగదు స్వాహాచేశారు.ఇదే విషయంపై స్తానిక కూలీలు సైతం 100ట్రిప్పులలోపే తోలారని ఆడిట్ బృందానికి తెలియజేశారు.కూలీలను వ్రాత పూర్వకంగా ఫిర్యాదుచేయాలని ఎస్.ఆర్.పి తెలుపగా సర్పంచ్ ఆద్వర్యంలో వ్రాతపూర్వక ఫిర్యాదులు అందించారు.ఈసమావేశంలో ఎ.పి.ఒ శ్రీనివాసరావు,ఎస్.ఆర్‌పి కాంతయ్య,కార్యదర్శి ఖాజామొహిద్దీన్,డి.ఆర్.పి శ్రీనివాసనాయక్,తదితరులు పాల్గొన్నారు.పోలీస్ బందోబస్తు నడుమ గ్రామసభ.టి.కొండారెడ్డి గ్రామంలో జరిగిన సామాజిక తనిఖి గ్రామసభకు ఎస్.ఐ బాలమహేంద్రనాయక్ ఆద్వర్యంలో బందోబస్తును కల్పించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సమావేశం జరిగేలా చూశారు.ఇప్పటికే ఈసమాజిక తనిఖీ జరుగుతున్న సమయంలోనే అదికారవై.సి.పి రెండు వర్గాలు గొడవపడి కేసులు పెట్టుకోవడంతో ముందస్తుగా ఎస్.ఐ బందోబస్తు కల్పించారు.

## గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ కృషి అభినందనీయం



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త:** శ్రీనివాస రామానుజన్ ప్రపంచ గణిత మేధావిగా చరిత్రలో నిలిచిపోయారని వక్తలు తెలిపారు. కావలి పట్టణంలోని డాక్టర్ లక్ష్మీకృష్ణారావు బాలుర పాఠశాల ఆవరణలో గురువారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల మ్యాథ్స్ క్లబ్, డాక్టర్ రామ్‌సెంటర్ సహకారంతో పుచ్చలపల్లి చిన్నమ్మ ఆరోగ్య సదనం ఆధ్వర్యంలో 135వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.ద్వారకనాథ్ చౌదరి, సామాజిక కార్యకర్త యం.మాలకొండారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు జి.కళ్యాణి, పి.కోటయ్య, సిహెచ్.బ్రహ్మయ్య, ఎన్.వి.ఎస్.జగన్నాథం, ఎస్.కె.షరీఫ్, పి.దేవకీదేవి, కె.శివకుమార్‌రెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని రామానుజన్ గొప్పతనాన్ని, మేధస్సును కొనియాడారు.

## ప్రతి విద్యార్థి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**కావలి రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని విశ్వోదయ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్ప తెలిపారు. కావలి వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో గురువారం



యస్‌యూత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు యం.వి.యన్.ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణితంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, స్కూల్ అసిస్టెంట్ సయ్యద్ హయ్యాల్ హయ్యామ్, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు గోళ్ల అమరజ్యోతి, వైస్ చైర్మన్ సయ్యద్ ఘనీబాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో ఘనంగా రమానుజన్ జయంతి వేడుకలు

**నెల్లూరు, డిసెంబరు22 ప్రభాత వార్త-విద్య:** నగరంలోని స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని నారాయణ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో ప్రసిద్ధ గణితశాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజిఎం రవివర్మ పాల్గొని మాట్లాడారు. ప్రతి




ఏటా డిసెంబరు 22న రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరి ంచుకుని గణితదినోత్సవాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. గణితశాస్త్రంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని కోనియాడారు. ఆర్ఐ రమేష్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ పెంచల ప్రసాద్‌లు మాట్లాడుతు గణితశాస్త్రం యొక్క ఆవశ్యకత, అవి నేర్చుకోవటం వలన కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విదా ్యర్దులకు గణితశాస్త్రంలో క్విజ్, పజిల్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిబ కనపరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.తొలుత రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రమేష్‌రెడ్డి నగర్‌లో:నగరంలోని స్థానిక రమేష్‌రెడ్డి నగర్ నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంరదృంగా విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి రామానుజన్ చిత్రపతానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం రమణారెడ్డి, డీన్ యుగంధర్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, సిబ్బంది హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

**సైదాపురం, డిసెంబరు 22, పభాతవార్త:** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలతలుపూరు సచివాలయాన్ని గురువారం పరిశీలించారు. ఈ



సందర్భంగా ఆయన హాజరుపట్టికలను, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్ధేశంతో గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని, సచివాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు. కొన్ని సచివాలయాల్లో కచ్చితంగా వలంటీర్ల పని తీరులో మార్పు రావాలని తెలిపారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సియం సహాయనిధి చెక్కు పంపిణీ



**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామానికి పి.రమాదేవికి గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 50 వేల రూపాయల చెక్కును కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ యం.వీరరఘు, ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపిటిసి ఎ.కె.సుందర్‌రాజు, యువత మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, మద్దిబోయిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు




**కావలి రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నందు గురువారం గణిత దినోత్సవం సందర్భంగా గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రధానాచార్యులు, గణిత శాఖ ప్రధానాచార్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ గణితం దైనందిన జీవితంలో ఒక ముఖ్య పాత్ర పోషిస్తుందని, మనిషి జీవితం గణితంతోనే ముడిపడి వుందని తెలిపారు. చిన్నతనం నుండే గణితంపై ఆసక్తిని, అభిరుచిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను, ఆయన గణితానికి చేసిన కృషిని తెలియజేస్తూ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ భరత్‌కుమార్, ప్రసాదరావు, శ్రీలత జ్యోతి, ప్రధమ, ద్వితీయ సంవత్సర విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి, ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



**కొండాపురం, డిసెంబరు 22 ప్రభాతవార్త** కొండాపురంలోని బిసి, ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులకు మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దుప్పట్లు, కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మన్నేటి వెంకటరెడ్డి మాట్లాడారు. బిసి, ఎస్సీ హాస్టల్‌లోని 113 మంది విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు అందజేశామన్నారు. చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేశానన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు, చదువులు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు .భవిష్యత్‌లో కూడా తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్సీ హాస్టళ్ళ వార్డెన్లు చలపతి, కొండయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ ట్రస్ట్‌లో సర్టిఫికేట్లు అందజేత



**అల్లూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ నందు కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన 22 మందికి ట్రైనింగ్ సర్టిఫికేట్లను గురువారం స్వర్ణ భారత్ ఇన్స్‌టిట్యూట్ ప్రైమర్ ఫిష్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ పణికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా పణికుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికేట్లు అందుకున్న వారందరూ మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అభినందనలు తెలిపారు. కంప్యూటర్స్ విభాగంలో ఇంకా ఉన్నత శిక్షణ కావాలంటే వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు వచ్చి శిక్షణ పొందాలన్నారు. డిఎస్ఆర్ ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 4వ తేదిన కంప్యూటర్ కోర్సు కొత్త బ్యాచ్ ప్రారంభమౌతుందని శిక్షణ కావాల్సిన వారు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. అదే విధంగా జనవరి 18వ తేదిన బ్యూటీ పార్లర్ కోర్సు, మగ్గం వర్క్ శిక్షణ ప్రారం భిస్తామని ఆసక్తి గల వారు 9100551108 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, పులి సుధాకర్, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ గణిత దినోత్సవం



**అల్లూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** అల్లూరు సిద్ధార్ధ ఇంగ్లీషు మీడియం స్కూలు నందు జాతీయ గణిత దినోత్సవాన్ని గురువారం కరస్పాండెంట్ హనుమాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలులో 6 నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితంలో ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు సిద్ధార్ధ స్కూలు పూర్వపు విద్యార్థులు బి.సుప్రజారెడ్డి, పి.రామకృష్ణలు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం హనుమాచార్యులు మాట్లాడుతూ భారతీయ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను గుర్తు చేసుకుంటూ జాతీయ గణిత దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా వుందన్నారు. ప్రతి విద్యార్థి గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని కోరారు.

## గణిత మేధావి రామానుజన్



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** గణిత మేధావి రామానుజన్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో గురువారం గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితం యొక్క ప్రాముఖ్యత ఎక్కువగా ఉందన్నారు. గణిత ఉపాధ్యాయులు పి. వాణిశ్రీ, డి. సుభాషిణి, టి. రాజేశ్వరి, జి. స్వరూపరాణి, విద్యార్థులు ఉన్నారు.

## శ్రీ వెంటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 'జాతీయ గణిత దినోత్సవం'




**కొడవలూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని శ్రీ వెంటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నందు గురువారం ఎన్ఎస్ఎస్ మరియు గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా 'జాతీయ గణిత దినోత్సవం' ఘనంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మరియు సిఎస్ఇ హెచ్ఓడి శ్రీ ఎం. ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితంలో కనపరిచిన ప్రతిభను, అధ్యాపకులు మరియు విద్యార్థులు మిక్కలిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబునాయుడు, కళాశాల డైరెక్టర్ పెనుబల్లి కృష్ణచైతన్య మొదలి సంవత్సరం బిటెక్ ఇన్‌చార్జ్ డాక్టర్ పిఎస్ఆర్‌కె ప్రసాద్, గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. చంద్రశేఖర్, ఎస్ శ్రీధర్, ఎం. వెంకటేశ్వర్లు, ఎస్‌డి. ఫర్హానా, ఎస్. నాగేంద్రబాబు, వీరితోపాటు ఇతర అధ్యాపకులు ఎస్.వెంకటేశ్వర్లు, జి.గీత, డి.రమణ, వై.సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణిత మేధావి రామానుజన్ జీవితం ఆదర్శం



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** అంర్జాతీయ స్థాయిలో భారతీయ గణితానికి గుర్తింపు గౌరవాన్ని తెచ్చిన గణిత మేధావి రామానుజన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రముఖ భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 126వ జయంతి వేడుకలు పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే రామానుజన్ తన అసమాన గణిత శాస్త్ర పాండిత్యంతో ప్రపంచ మేధావులను సైతం ఆశ్చర్యచకితులను చేశారన్నారు. రేఖా గణితం, ఆల్‌జీబ్రా, కలనగణితం, గణిత శాస్త్ర శాఖలలో రామానుజన్ విస్తృతమైన పరిశోధనలు చేసి అసంఖ్యాకమైన గణిత సూత్రాలను, సిద్ధాంతాలను ప్రతిపాదించారన్నారు. ఆయన ప్రతిపాదించిన ఆవిష్కరణాత్మక సిద్దాంతాలు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా గణిత శాస్త్రజ్ఞులను ఉత్తేజపరుస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ యువ గణిత శాస్త్రజ్ఞులకు రామానుజన్ జీవితం ఆదర్శనీ య మన్నారు. ఆయన చూపిన బాటలో పయనించి గణిత శాస్త్రంలో ప్రపంచ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కళాశాల ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ పీఎం కిషోర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** రక్షిత నీటి పథకాల పనులు వేగవంతం కావడమే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ పేర్కొన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో నిర్మాణం చేపడుతున్న రక్షిత నీటి పథకం నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు క్యూరింగ్ కూడా సక్రమంగా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, తదితరులు ఉన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** చదువుకున్న చదువులకు తగిన ఉద్యోగాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లోని వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుందని ఆమె తెలియజేశారు. ఇంటర్‌మీడియట్, డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు స్కిల్ హబ్ ద్వారా ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందజేయడం జరు గుతుందన్నారు. ఈ శిక్షణలో భాగంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి అందులో ఉత్తీర్ణులైన వారికి ఇంటెల్ ఐటీ సొల్యూషన్స్ చెన్నై కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవ కాశాలు కల్పిస్తామన్నారు. అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. దీనిపై ఏమైనా సమాచారం కావాలంటే 8142322166, 6301529271 నెంబర్ల ద్వారా సమాచారం పొందాలన్నారు.

## ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** రైతులు తాము పండించిన పంటల ను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవడం వలన వారికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అ న్నారు. కోవూరులోని సహాయ వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురు వా రం ఆమె మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు వలన ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా రైతుభరోసా, తదితర వాటికి కూఆ ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన పెంచి సకాలంలో ఈ క్రాప్ నమోదు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ 125వ జయంతి వేడుకలు



**నెల్లూరు టౌన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనారిటీ బాలురు) ఆటోనగర్, నెల్లూరు నందు ప్రిన్సిపాల్ టి.కామేశ్వరి ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ 125వ జయంతిని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గురువారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సుడోకు, క్యూబ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ కామేశ్వరి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్‌లో 1887 డిసెంబరు 22వ తేదీన జన్మించారని, 1920 ఏప్రిల్ 26వ తేదీన కోయంబత్తూరులో మృతి చెందారన్నారు. ప్రపంచ గణిత మేధావి అయిన శ్రీనివాస రామానుజన్ అతి చిన్న వయసులోనే మృత్యువాత పడ్డారని ఆమె తెలిపారు. నేటి సమాజంలో గణితం యొక్క ప్రాముఖ్యత చాలా అవసరమన్నారు. గణితం పట్ల భయం విడనాడి ఆసక్తి పెంచుకుని చేసినట్లయితే మంచి ఫలితాలను సాధించగలరని ఈ తరానికి యువ శాస్త్రవేత్తలుగా తయారు కావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీగోపాలకృష్ణయ్యస్కూల్‌లో మ్యాథ్స్ దినోత్సవం



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్దులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. మ్యాథ్స్ ఎగ్జిబిషన్ మరియు మ్యాథ్స్ పజిల్స్‌ని విద్యార్దులకు ఏర్పాటు చేసి అందులో గెలిచిన విద్యార్దులకు బుచ్చిరెడ్డిపాళెం లైన్స్ క్లబ్ వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిధులు మాట్లాడుతు గణితం కష్టమైన విషయం కాదని దాన్ని ఇష్టంగా మలచుకుంటే మన జీవితాలు బాగుపడుతాయని తెలిపారు. ఈకార్యక్ర మంలో లయన్స్ క్లబ్ అద్యక్షులు వెంకటేశ్వర్లు, బుచ్చి దంత వైద్యులు డాక్టర్ జావిద్, విద్యార్దులకు బహు మతులు అందజేశారు. ఈకార ్యక్రమంలో కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, మ్యాద్స్ టీచర్స్ సురేఖ, గిరిజ, అనిత, ఆమని, విజయలక్ష్మి విద్యార్దులు పాల్గొన్నారు.

## సమగ్ర విచారణ చేపట్టండి



**నెల్లూరుఅర్బన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నెల్లూరులో పౌరసరఫరాల సంస్థ కార్యాలయం తగలబడి నప్పటి నుంచి ఆ శాఖ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ రాష్ట్ర నేత మిడతల రమేష్ నెల్లూరు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. 2017 నాటి నుంచి ఆడిటింగ్ జరిపి కుంభకోణాన్ని నిగ్గు తేల్చాలని ఆడిటింగ్ అధికారులు, ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ఇద్దరు జిల్లా మేనేజర్లుగా పని చేసిన వారు అరెస్టు కాబడ్డారు. పౌర సరఫరాల సంస్థ గతంలో తగలబడిందా? లేక తగులు ? అనే అంశాన్ని విచారించాల్సిన అవసరం ఉంది. 2011 సంవత్సరం నుంచి సమగ్ర విచారణ జరిగినట్లయితే రైతుల రవాణా డబ్బులతో పాటు ధాన్యం కుంభకోసం కూడా వెలుగులోకి వస్తుంది. 2011 నుంచి విచారణ జరిపితే వేయి కోట్ల మేర అవినీతి బయటపడే అవకాశం ఉందని రమేష్ డిమాండ్ చేశారు. పదిసంవత్సరాల కాలం పాటు విచారణ జరిపితే రాష్ట్రంలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక అధికారుల అవినీతి భాగవతాలు వెలుగులోకి వస్తాయని అందుకు సహకరించాలని ప్రస్తుత డీఎం సుధాకర్‌ను రమేష్ కోరారు.

## పార్టీలకతీతంగా ట్రస్ట్ సేవలు



**వింజమూరు, డిసెంబర్22 ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా'మన' ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవలందిస్తామని మన ఫౌండేషన్ చైర్మెన్ మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం వింజమూరులోని తిరుమలానగర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్నేటి వెంకటరెడ్డికి వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారి సన్నిధిలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి మండల కేంద్రంగా గంగిరెడ్డిపాళెం పంచాయతీలో ప్రారంభమైన ట్రస్ట్ సేవలు విస్తృతంగా కొనసాగించేందుకు తనకు జన్మనిచ్చిన మన్నేటి పాపిరెడ్డి-తిరుపతమ్మ లు చూపిన సేవా మార్గంలో పయనించాలనే ఉద్దేశంతో 2015లో ట్రస్ట్‌ను స్థాపించి సేవలకు శ్రీకారం చుట్టామన్నారు. ముందుగా తమ ఫౌండేషన్ ద్వారా కొండాయపాళెం గ్రామాన్ని దత్తత తీసుకొని విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఆప్రాంత ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ఆర్ ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు వేలాది మొక్కలను రోడ్డుకిరువైపులా నాటించి వాటి సంరక్షణకు ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. తమ పంచాయతీ పరిధిలోనే కాకుండా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఆరోగ్యం , ఉపాది కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా పనిచేస్తామన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా తమ ఫౌండేషన్ నియోజకవర్గ ప్రజలకు మున్ముందు మరిన్ని సేవలందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో రంతూజానీ, ఓబులేశు, జాఫరుద్దీన్, మున్నా, చిన్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో బాలికోన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**వింజమూరు, డిసెంబర్22 ప్రభాతవార్త:** వింజమూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జంప్‌రోప్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులను గురువారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య మాట్లాడుతూ నంధ్యాల జిల్లాలోని గోవిందపల్లిలో ఈనెల 10,11తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాఠశాలకు చెందిన 5మంది విద్యార్థినిలు ప్రతిభ కనపరిచారన్నారు. ఈపోటీల్లో జి.వి.హర్షిణి స్వర్ణపతకం, డి.భవిష్యశ్రీ రజిత పతకం, పి.సహస్ర రజితపతకం , పి.శ్రీజ కాంస్య పతకం, పి.స్నేహవర్షిత కాంస్యపతకం సాధించారన్నారు. కాగా జి.వి.హర్షిణి, పి.సహస్ర, పి.స్నేహవర్షిత లు మహా రాష్ట్రలో జరిగే జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనపరచిన విద్యార్థులు మరిన్ని పతకాలను సాధించాలని వారు కోరారు. విద్యార్థినిలకు శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు రజనీవిలాసినిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## రహదారికి అడ్డంగా నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని ఆపాలి



**వింజమూరు, డిసెంబర్22ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని బంగ్లాసెం టర్, సుజాతనగర్ కాలనీమీదుగా జై భీంనగర్‌కు కాలనీ వెళ్ళే రహదారికి అడ్డంగా ఎఫ్‌సిఐ గోడౌన్ వారు నిర్మిస్తున్న ప్రహరీగోడ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని జైభీంనగర్ కాలనీవాసులు గురువారం డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల కాలంగా నడుస్తున్న రహదారిని నేడు గోడౌన్ నిర్వాహకులు ప్రహరీగోడ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయడం తగద న్నారు. ఎన్నో ఏళ్ళుగా బండిబాటగా ఉన్న ప్రాంతాన్ని మూసివేస్తే కాలనీకి సమీపంలోని వందలాదిమంది రైతులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కాలనీవాసులు ఏదైనా ప్రమాదం జరిగితే చుట్టూతిరుక్కొని వెళ్ళాల్సిన పరిస్థితి ఉంద న్నారు. గతంలో కూడా ప్రహరీగోడనిర్మాణాన్ని చేపట్టగా తాము ఆందోళన చేయడంతో విరమించారని, నేడు కూడా మళ్ళీ నిర్మాణానికి పూనుకోవడం సబబుకాదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళామని సొసైటీచైర్మెన్ జూపల్లి రాజారావ్, కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి లకు కూడా సమస్యను వివరించామని వారు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు. ఈకార్యక్రమంలో పి.చెన్నయ్య, జి.చిన్నయ్య, ఎ.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు, ఎ.సురేష్, ఎన్.కేశవ, బాలకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఆర్‌లో రంగవల్లుల పోటీలు

**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం చిన్మయి మిషన్ నెల్లూరుకు చెందిన బత్తిన కుమార్‌స్వామిరెడ్డి సహకారంతో వారి సిబ్బంది ఎ.ప్రసాద్, డి.శ్రీనివాసరావు,లీలామోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ఎస్.రెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డిలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పద్మజారాణి, లీలావతి,లక్ష్మిలు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

**కోవూరు,డిసెంబరు 22 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికి తీసేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో గురువారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులు తయారు చేసి పలు గణిత నమూనాలు ప్రతి ఒక్కరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆల్‌జీబ్రా , త్రికోణం, షడ్భుజి ఆకారం తదితర అంశాలను మేళవించి ప్రత్యేకంగా తయారు చేసిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశీలించిన ఉపాధ్యాయులు కూఢ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు , విద్యార్థులు ఉన్నారు.

### ఆల్‌ఇండియా కన్స్యూమర్ వెల్‌ఫేర్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పినాకినీ రాజు



**నెల్లూరు టౌన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఆల్‌ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా యువ రచయిత, పినికానీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు నియమింపబడ్డారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు అశ్విని మహేంద్ర, జాతీయ జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారీల నుంచి ఉత్తర్వులు రాజుకు అందాయి. మురళీమోహన్‌రాజు గత 16 సంవత్సరాలుగా పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ స్థాపించి ఎన్నో సేవా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. రాజు సేవల్ని గుర్తించిన ఆల్ ఇండియా కన్స్యూమర్ ఫోరం నేషనల్ ప్రెసిడెంట్ అశ్విన్ మెహాడియా, నేషనల్ జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారీ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల నెల్లూరు జిల్లా ప్రజలు మురళీమోహన్‌రాజును అభినందించారు.

## రైతుల చిరకాల కోరిక నెరవేర్చిన మంత్రి కాకాణి



**వెంకటాచలం, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కందలపాడు గ్రామ రైతులు కాలువ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎట్టకేలకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కేవలం నెల లోపే మంజూరు చేయించి నిధులు ఇప్పించి పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసి అందరి సమక్షంలో బ్రిడ్జిని ప్రారంభించారు. దీంతో కందలపాడు గ్రామ రైతులు కాకాణికి అపురూప స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి ఈ బ్రిడ్జి పెండింగ్‌లో ఉందని, గడప గడప కార్యక్రమంలో గ్రామస్థులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వెంటనే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు పూర్తి చేసి వ్యవసాయ సీజన్‌లోపే రైతులకు వ్యవసాయ పనులకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు సంబంధించిన చుక్కల భూములను శాశ్వత పరిష్కారం చూపించేలా వేల ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతు ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన జలవనరుల శాఖ సెంట్రల్ డివిజన్ అధికారులను అభినందించారు. గ్రామంలో రైతుల విషయంలో రాజీ లేకుండా పనులను పూర్తి చేశామన్నారు. అందుకే గడప గడప కార్యక్రమంలో విశేష స్పందన వస్తుందని, దానిని చూసి యువత పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నాగరాజు, ఎంపీడీవో సుస్మిత, ఏఈలు బాలు, సుధీర్, సర్పంచు శివ, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులు ఏకమై సమస్యలు పరిష్కరించుకోవాలి



**నెల్లూరు డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని రకాల వ్యాపారస్తులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని పప్పులవీధిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా.లోకేష్ ఆదేశాల మేరకు తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూం డి.రాకేష్ సూచనల మేరకు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ -మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నగర వాణిజ్య విభాగ అధ్యక్షుడు దర్శి.హరికృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల.వెంకటేశ్వర్లురెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెళ్ళకూరు.శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ జీఎస్టీ, జెఎస్టీలతో చిరు వ్యాపారుల దగ్గర నుంచి అందరూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని విమర్శించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారస్తులందరూ సంఘటితమై సమస్యలను పరిష్కరించుకోవాలని వారికిసూచించారు.వ్యాపారస్తులందరికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అందుకు మనమందరం రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కోసం ప్రతి ఒక్క వ్యాపారి తమ సహాయ సహకారాలను టీడీపీకి అందిం చాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి జన్ని.రమణయ్య, మెంటా.వీరబ్రహ్మంగుప్తా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపాక.హరిప్రసాదరావు, నగర నియోజకవర్గ అధ్యక్షుడు గుణపాటి.కృష్ణతేజ, బిల్లుపాటి.రవి, రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ షేక్.మీరామొహిద్దీన్, రాష్ట్ర అధికార ప్రతినిధి తటవర్తి.వాసు, కప్పిర.శ్రీనివాసులు, మామిడాల.మధు, వై.రమేష్‌చంద్ర, తుళ్ళూరు.బాబుగౌడ్, కప్పిర.రేవతి, విజయ, గుత్తా.అన్నపూర్ణ, మంగమ్మ, ప్రమీల, పద్మా, సునీత తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని



**మర్రిపాడు,డిసెంబర్22ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండలాధ్యక్షురాలు గంగవరపు లక్ష్మీదేవి శ్రీనివాసు లునాయుడు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మర్రిపాడు మండలంలో ప్రభుత్వ పరంగా మంజూరైన అభివృద్ధి పనులు కొన్ని గ్రామాల్లో నత్తనడకన సాగుతున్నాయన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఆయా గ్రామాల్లోని అభివృద్ధి పనులపై దృష్టికేంద్రీకరించి సత్వరమే పనులను పూర్తిచేయించాలన్నారు .రైతులకు అవసరమైన ఎరువులను , విత్తనాలను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉండి పంపిణీ చేయాలన్నారు. ఇటీవల వర్షాలు ఎక్కువగా పడినందున వ్యవసాయ పనులు జోరందుకున్నాయని, కొన్ని పంటలకు తెగుళ్ళుకూడా సోకాయన్నారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలన్నారు. మాండూస్ తుఫాన్ వలన దెబ్బతిన్న పంటలను సర్వే జరిపి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నివేదికలను సిద్ధం చేయాలని ఎంపిపి కోరారు. ఎంపిడిఒ పి.నాగమణి మాట్లాడుతూ మండలంలో గ్రామాల వారీగా ఉన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సభదృష్టికి తేవాలన్నారు . సచివాలయ కార్యదర్శులు ప్రజా సమస్యలను తెలుసుకొని మండల స్థాయి అధికారుల దృష్టికి తేవాలన్నారు.ఈ సంద ర్భంగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సభముందు ఉంచారు. ఏపిలగుంట ఎంపిటిసి సభ్యులు హజరత్‌రెడ్డి మాట్లాడుతూ చిలకపాడు సచివాలయ పరిధిలో ఏపిలగుంట గ్రామం ఉందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను చిలకపాడుకు వెళ్ళి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. వ్యవసాయాధికారులు ఏపిలగుంట గ్రామానికి వచ్చిన ఎరువులు, విత్తనాలను స్థానికంగానే పం పిణీ చేయాలని ఆయన కోరారు. పలువురు సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈసమావేశంలో తహసిల్దార్ పి.హేమంత్‌కుమార్ , పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ కల్పన, మండల ఉపాధ్యక్షురాలు చప్పిడి రమణమ్మ, మండల పరిధిలోని వివిధ శాఖలకు చెందిన ఏఇలు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్ఓలు, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## విద్యావవస్థను అభివృద్ధి చేసింది మేకపాటి కుటుంబమే



**సీతారామపురం డిసెంబర్ 22 ప్రభాతవార్త** నియోజకవర్గంలో విద్యను అభివృద్ధి చేసింది మేకపాటి కుటుం బమేనని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అన్ని ప్రభు త్వ పాఠశాలలో చదువుతున్న 286 మంది 8 వతరగతి విద్యార్థులకు స్థానిక ఆదర్శ పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉదయగిరి నియోజ వకర్గంలో ఆదర్శ పాఠశాలలు కస్తూర్‌బా గాంధీ కళాశాలలు ఇంజనీరింగ్ డిగ్రీకాలేజి నవోదయ గురుకుల పాఠశాలలు ఎన్నో విద్యా సంస్థలను ఉదయగిరి నియోజకవర్గం నలుమూలలకు వచ్చేలా చేసిన ఘనత మేకపాటి సోదరులకు దక్కుతుందని తెలిపారు. ప్రస్తుతం 2 వందల కోట్ల రూపాయాల విలువ చేసే భూమిని అగ్రికల్చర్ కాలేజి ఏర్పాటుకు ముఖ్యమం త్రి జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశామని త్వరలోనే అగ్రికల్చర్ యూనివర్సిటీ ఉదయగిరి ప్రాంతంలో ఏర్పడుతుందని అన్నారు.రాబోయే రోజులలో విద్యా వ్యవస్థలో మార్పులు రాబోతున్నాయని డిజిటల్ క్లాసులు ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యఅందించాలని జగన్‌మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలిపారు.కారో ్పరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలు ఉండాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు నాట్య ప్రదర్శన ద్వారా పలువుర్ని ఆకట్టుకున్నారు.ఈకార్యక్రమంలో సీతారామపురం ,బసినేనిపల్లి, ఒగురువాండ్లపల్లి,అయ్యవారిపల్లి,ఉన ్నత పాఠశాలలప్రధానోపాధ్యాయులు పి .సుధాకర్,అంజయ్య,కొండయ్య ప్రభాకర్ ఆదర్శ పాఠశాలల ప్రిన్సిఫల్ రహిమన్ వైసిపి నాయకులు చింతబోయిన దుర్గయ్య, రామిశెట్టి తిరుపతయ్య,మునగల రామచంద్రారెడ్డి,దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి,లఖిడి బ్రహ్మయ్య,కల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి,పొట్టి రామచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, మేరం రామయ్య,తదితరులు పాల్గోన్నారు.

## జగనన్న పాలనలో విద్యారంగానికి పెద్ద పీట




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేసి పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కొరకు ఎంతగానో కృషి చేస్తున్నారని నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలిపారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక 28వ డివిజన్ పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే 8వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసీపీ నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదుల్లో చెప్పే పాఠాలను ఇళ్లకు వెళ్లాక కూడా పిల్లలు మరింత క్షుణ్ణంగా, సులభంగా నేర్చుకునేందుకు సీబీఎస్ సిలబస్ ఆధారంగా యాప్‌లో పాఠ్యాంశాలు రూపకల్పన చేస్తారని పేర్కొన్నారు. ఇంటి వద్ద ఇంటర్‌నెట్ సౌకర్యం లేని విద్యార్థులకు ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా 8, 9 తరగతులకు కంటెంట్ మెమోరి కార్డు ద్వారా ట్యాబ్‌లోనే ప్రీలోడెడ్‌గా ఉంటుందని తెలిపారు. ఈ నూతన టెక్నాలజీ ద్వారా ట్యాబ్‌లో సెక్యూర్ సాఫ్ట్‌వేర్ పొందుపరిచారని దీని ద్వారా పాఠాల బోధనకు సంబంధించిన అంశాలు మాత్రమే విద్యార్థులు చూడగలరని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులలో సమానత్వం తీసుకురావడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలో ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహల్య, స్థానిక డివిజన్ ఇన్‌చార్జ్ చెక్కా సాయిసునీల్, 33వ డివిజన్ ఇన్‌చార్జ్ కరణం హజరత్‌నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు మిద్దె మురళీకృష్ణయాదవ్, కోఆప్షన్ సభ్యులు షేక్ వహీదా, ఎంఈవో తిరుపాలయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేలో యువత భారీగా చేరిక




**నెల్లూరు,డిసెంబరు22 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక 30వ డివిజన్ పరిధిలో గల యువత గురువారం జిల్లా జనసే పార్టీ కార్యాలయంలో ఆపార్టీ జిల్లా, నగర అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి, దుగ్గిశెట్టి సుజయ్‌బాబుల సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాను కప్పి పార్టీలోని స్థాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి మాట్లాడుతు 30వ డివిజన్ పరిధిలో ఇతర పార్టీల్లో చురుగా ఉంటున్న యువత తమ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకోసం పడుతున్న కష్టాలను , ఆయన ఆశయాలకు ఆకర్షితులై తమ పార్టీలో చేరటం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఈ చేరికలను పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు. పార్టీకోసం నిరంతరం శ్రమించి కష్టపడే వారికి సముచిత స్థానం దకు ౖ తుందన్నారు. నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు 30వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జ్ షేక్.కరి ముల్లా ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రజలు రాక్షస పాలనను చూస్తు న్నారని, అన్నీ వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి అయివుండి కూడా ప్రజలను పాలించకుండా వారిని ఇబ్బందులకు గుర్తిచేస్తున్న జగన్ మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపా ్పలని పిలుపునిచ్చారు. అధికారం ఉన్నా, లేకున్నా, ప్రజలకోసం నిస్వార్థంగా పాటు పడుతున్నది తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రమేనని, ఆయన ఆశయాలకు ఆకర్షితులై యువత తమ పార్టీలో చేరుతున్నారన్నారు. రాన్ననని జనసేన ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అన్నీ నియోజకవర్గాల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అనంతరం 30వ డివిజన్ కమిటీని ఎం పికచేసి ఉపాధ్యక్షులు, కార్యదర్శి, ప్రధానకార్యదర్శులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయుకలు రమణయ్య, ఫయాజ్, పెంచలరావు, మస్తాన్, బాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన సహస్ర చండీ మహాయోగ మహోత్సవాలు



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త** కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డులోని స్కందా ఫ్రైడ్ వరాహ వెంచర్స్ ప్లాట్స్ ప్రాంగణంలో చేపట్టిన సహస్ర రుద్ర సహిత సహస్ర చండీ మహాయాగ మహోత్సవ వేడుకలు గురువారంతో వైభవంగా ముగిశాయి. వైసిపి కావలి నియోజకవర్గ కీలకనేత, మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కల్పన దంపతుల స్వీయ పర్యవేక్షణలో ఈ నెల 15వ తేది నుంచి 22వ తేది వరకు 8 రోజుల పాటు 150 మంది రుత్వికులు, వేద పండితులతో సహస్ర చండీ మహాయాగ మహోత్సవాలు ఎంతో కనులవిందుగా సాగాయి.వేదపండితుల మంత్రోచ్చారణల హోరులో అమ్మవారి హోమ పూజలు జరిగాయి. ప్రతి రోజు దుర్గా మాత నవ అవతారాలలో భక్తులకు దర్శనమి చ్చారు. చివరి రోజు చండీ రూపంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. హోమ గుండాలలో చండీ హోమాలు, రుద్ర పారాయణాలు, చండీ పారాయణాలు, జనాభిషేక హోమాలు నిర్వహించారు. 8 రోజుల పాటు సంప్రదాయ దుస్తులతో వచ్చిన భక్తులకు లోపలకు అనుమతిచ్చారు. విశేష పూల గజమాలలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వారం రోజులపాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టిఫిన్,భోజన సదు పాయాలు కల్పించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతుల సహకారంతో మన్నెమాల దంపతులు స్వీయ నిధులతో సహస్ర రుద్ర సహిత సహస్ర చండీ మహాయోగ వేడుకల్ని నిర్వహించారు. విద్యాశంకర భారతి మహాస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో చండీమహాయాగాలు నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే దంపతులు,పట్టణంలోని భక్తులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కార్పొరేషన్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను గురువారం అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేయర్ స్రవంతి జయవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యాలయ ప్రాంగణంలో దేదీప్యమైన విద్యుత్ కాంతుల నడుమ క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జననం కళాఖండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రీస్తు జననానికి సంబంధించిన ముఖ్య ఘట్టాలను వివరిస్తూ సంగీత వాయిద్యాల నడుమ క్రీస్తు గానములు కార్యాలయ సిబ్బంది ఆలపించారు. అనంతరం ఆనందోత్సాహాల నడుమ కేక్ కట్ చేసి సిబ్బందికి పంచి పెట్టారు. ప్రీ క్రిస్మస్ వేడుకలను ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ ఇటీవల రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నామని, అదేవిధంగా నెల్లూరు నగరపాలక సంస్థలో కూడా ప్రతి ఏటా ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ అధికారులకు, సిబ్బందికి, నగర ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డి.హరిత, స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి, కార్పొరేటర్ చేజర్ల మహేష్, కోఆప్షన్ సభ్యులు మొబీన, నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రధానం



**నెల్లూరు,డిసెంబరు22 ప్రభాతవార్త-విద్య** సుప్రసిద్ధ గణితవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలోని స్థానిక వేదాయపాళెంలోని శ్రీసాయి మహావిద్యాలయ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన,గణితంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి.నారాయణ మాట్లాడుతు గణితంలో శ్రీనివాస రామానుజన్ చేసి కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎంతో క్లిష్టమైన గణింతాన్ని సరళమైన విదానంలో బోధించేందుకు ఆయన చేసిన శ్రమ మరువలేనిదని కోనియాడారు. ఆయన గొప్పతనాన్ని నేటి తరానికి తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందన్నారు. ఆయన జన్మదినాన్ని పరస్కరించుకుని ప్రతిఏటా డిసెంబరు 22న గణితశాస్త్ర దినోత్సవంగా నిర్వహించుకోవటం జరుగుతుందని తెలిపారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులులేని ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**పొదలకూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో ఒక పాఠశాల పేరుతో అనుమతులు పొంది మరో పాఠశాలగా నడుపుతుయదేచ్ఛగా అధిక పీజులు వసూలు చేస్తు విద్యను వ్యాపారంగా మారుస్తు అక్రమార్కులు కొందరు విద్యా వ్యవస్థను అడ్డం పెట్టుకొని పేదల సొమ్ము దోచుకుంటున్నారని టిఎన్ఎస్ఎప్ తిరుపతి పార్లమెంట్‌ఉపా ధ్యా క్షులు కలగట్ల సందీప్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎంఇఒ ఆపీస్ వద్ద టిఎన్ ఎస్ఎప్ ఆధ్వర్యంలోఅనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటు కార్యాలయం వద్దకు చేరి నినాదాలు చేశారు.అనంతరం ఎంఇఒ అందుబాటులో లేకపోవ దంతో వినతి పత్రం సమర్పించేందుకు దిగువ స్థాయి అధికారులు స్వీకరించడానికి సిద్దం కాకపోవడంతో ఎఇ ఒ కుర్చీపై వినతి పత్రాన్ని ఉంచారు.అనంతరం విలేఖర్లతో మాట్లాడుతు ఇటీవల కాలంలో జిల్లాలో పలు పాఠశాలలో విద్యార్థినులపై పలు అఘాయిత్యాలు జరిగిన విషయం వెలుగులోకి వచ్చినా కూడా అనుమ తు లు లేని పాఠశాలలో అటువంటి ఘటనలు చోటు చేసుకుంటే బాధ్యులు ఎవ్వరని మండల విద్యాశాఖాధికారి బాధ్యత వహిస్తారా అంటు కలగట్ల సందీప్ నిలదీశారు.నిద్రపోతున్న ప్రభుత్వం అనుమతులు లేని పాఠశాలలు యదేచ్ఛగా పీజులు పేరిట అధిక సొమ్మును పేద విద్యార్థి తల్లిదండ్రుల వద్ద దారుణంగా దోచుకుంటున్నా కూడా మండల అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. అక్రమంగా అన్యా యంగా పాఠశాలలను అనుమతులు లేకుండా నిర్వహిస్తు ఉన్నవిషయం విద్యాశాఖాధికారులకు తెలియదా! తెలియకపోతే విద్యార్థి సంఘాలు ఈవిష యాన్ని అధికారుల దృష్టికి తీసుకొని వస్తున్నా కూడా బాధ్యతారా హిత్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రు లైన ఎవ్వరికి వారు జాగ్రత్త పడాల్సి న అవసరం ఉందని నాయ కుడు సందీప్ సూచించారు.ఈమేరకు వారం రోజులలోపు అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకో కపోతే పట్టణంలోని ఎంఇఒ ఆపీస్ ముట్టడిస్తామని జిల్లాలోని డిఇఒ ఆపీస్ వద్ద ఆందోళనలు ఉధృతం చేస్తా మని జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించాల్సి న అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో హరికృష్ణా, అనీల్‌కు మార్, ఫణీంద్ర,సూర్యా, హరికృష్ణా,తదితరులు పాల్గోన్నారు.

## విద్యార్థులకు ట్యాబులు పంపీణి చేసిన మేకపాటి



**ఉదయగిరి డిసెంబర్ 22 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మేల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 8 వతరగతి విద్యార్థులకు జగనన్న ట్యాబులు పంపీణి కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మేల్యే మాట్లాడుతు సిఎం జగన్ ప్రత్యేకంగా అనేక పథకాలు మొదలుపెట్టి పిల్లల భవిష్యత్తుకొరకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.నాడు-నేడు పథకం కింద స్కూల్స్ రూపురేఖలు మార్చి వేసిన జగనన్న గోరుముద్ద ద్వారా అద్భుతమైన అహారాన్ని అందించిన పిల్లల చదువుకొరకు బ్యాగులు పుస్తకాలు పంపీణి చేశారని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత జ్ఞానాన్ని సంపాదించడానికి వైజ్ఞానిక పరంగా ట్యాబ్‌లు అందజేసి వారిని ప్రపంచానికి మరింత చేరువ చేశారని అన్నారు.ఉపాధ్యాయులు బోధించే చదువుతోపాటు తమకు అవసరమైన పరిజ్ఞానాన్ని సాంకేతికత ద్వారా పెంపొందించుకుంటు విద్యార్థులు అద్భుతంగా ముందుకు సాగాలని కోరారు.ఈకార ్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్,ముర్తుజా, గడియాల్సి యజ్దాని తదితరులు పాల్గోన్నారు.

## 30న జిల్లా స్థాయి సంఘ సమావేశాలు

**నెల్లూరు అర్బన్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ఏడు స్థాయి సమావేశాలు ఈ నెల 30వ తేదీన నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సీఈవో చిరంజీవి తెలిపారు.